ప్రజాశక్తి
బుధవారం 9 అక్టోబర్ 2024
5
విజయనగరం

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నాయి. డిసిసి అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ ఆధ్వర్యాన స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే జమ్ముకాశ్మీర్ ఎన్నికలకు ప్రత్యేకత ఉందన్నారు. అక్కడ కాంగ్రెస్ గెలవడంతో ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. హర్యానాలో కూడా ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా ఇచ్చినప్పటికీ అక్కడ బిజెపి ఏం మతలబ్ చేసిందో అర్థం కాలేదని అన్నారు కాంగ్రెస్ తోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, సతీష్, షరీఫ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు పోటెత్తిన దరఖాస్తులు

- 153 షాపులకు 2534,
- మన్యం జిల్లాలో 576 దరఖాస్తులు
- నేటితో ముగియనున్న గడువు
- మరిన్ని పెరిగే అవకాశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మరో రెండు రోజుల సమయం ఉండడంతో సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. విజయనగరం జిల్లాలో పది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 153 దుకాణాలకు, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. విజయనగరంలో మంగళవారం సాయంత్రం వరకు 2534 దరఖాస్తులు వచ్చాయి. దాదాపు అన్ని దుకాణాలకు దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా పరిశీలించినప్పుడు ఒక్కో దుకాణానికి 16చొప్పున దరఖాస్తులు అందినట్టుగా అర్థమౌతోంది. ఒకే దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చుంటూ ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించిన విషయం విధితమే. ఈనేపథ్యంలో కాస్త ఎక్కువ వ్యాపారం జరుగు తుందనుకున్న చోట మద్యం వ్యాపారులు పోటీపడుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మారుమూల మండలాలతో పోలిస్తే జిల్లా కేంద్రం, గజపతినగరం, ఎస్.కోట, రాజాం, బొబ్బిలి తదితర పట్టణ ప్రాంతాల్లో దుకాణాలకు కాస్త ఎక్కువ దరఖాస్తులు అందినట్టు తెలిసింది. అటు మన్యం జిల్లాలోనూ 52 దుకాణాలకుగాను ఇప్పటి వరకు 576 దరఖాస్తులు అందాయి. విజయనగరం జిల్లాలో పోలిస్తే మన్యంలో దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. సగటు దుకాణానికి 11 దరఖాస్తులు వచ్చాయి.

ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించ నున్నారు. అనంతరం 11వ తేదీన విజయ నగరం జిల్లాకు సంబంధించి ఆనంద గజపతి ఆడిటోరియంలోనూ, పార్వతీపురం జిల్లాకు సంబంధించి నాయుడు ఫంక్షన్ హాల్లో లాటరీ తీయనున్నారు. ప్రభుత్వం ఆదాయమే లక్ష్యంగా రూ.2లక్షల దరఖాస్తు ఫీజు చెల్లించాలి. నిర్ధేశించిన దుకాణం పరిధిలో 10వేల లోపు జనాభా ఉంటే లైసెన్సు ఫీజు రూ.50లక్షలు చెల్లించాల్సి వుంటుంది. 10వేల నుంచి 50వేల లోపు జనాభా అయితే రూ.55లక్షలు, 50వేల నుంచి 5లక్షల లోపు జనాభా గలిగిన దుకాణానికి రూ.65లక్షలు, 5లక్షల జనాభా పైబడిన దుకాణాలకు రూ.85లక్షల చొప్పున ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. ఒక ఏడాది తరువాత 10శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లైసెన్సుకు రెండేళ్ల కాలపరిమితి కూడా ప్రభుత్వం విధించింది. 2026 సెప్టెంబర్ 30తో ముగియనుంది. రెండేళ్ల కాలపరిమితికి ఇంత ఎక్కువ మొత్తంలో డబ్బు వెచ్చించినప్పటికీ దరఖాస్తులు తగ్గలేదంటే మద్యం వ్యాపారంలో గడిస్తున్న లాభాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని జనం వ్యాఖ్యానిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచే అత్యధిక దరఖాస్తులు

జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి రామచంద్ర రావు

భోగాపురం : రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే మద్యం షాపులకు అత్యధిక దరఖాస్తులు వచ్చాయని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి రామచంద్రరావు అన్నారు. భోగాపురం ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో 205 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు. ఇప్పటివరకు 1909 దరఖాస్తులు వచ్చాయన్నారు. విజయనగరం జిల్లాలో 4500 దరఖాస్తులు, పార్వతీపురం జిల్లాలో 1500 దరఖాస్తు వస్తాయని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. చివరిరోజైనా 9వ తేదీన భారీగా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నామని తెలిపారు. సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 11వ తేదీన దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. అనంతరం ఆయన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. సిఐ వి రవికుమార్, ఎస్ఐలు చంద్రమోహన్, సురేష్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

క్రీడానైపుణ్యాన్ని పెంచేందుకు కృషి

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పలు ఉత్సవ వేదికల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మన వైభవాన్ని దశదిశలా చాటేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి మంత్రి శ్రీనివాస్ ఉత్సవ వేదికలను మంగళవారం పరిశీలించారు. ముందుగా విజ్జీ స్టేడియంను సందర్శించారు. నూతనంగా నిర్మితమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను పరిశీలించి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. స్కేటింగ్ ట్రాక్‌ను, వాలీబాల్ కోర్టును, పోటీలు నిర్వహించే క్రీడామైదానాన్ని, క్రికెట్ స్టేడియంను పరిశీలించారు. ఫ్లడ్ లైట్లు, నెట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్టేడియం నుంచి స్కేటింగ్ ట్రాక్‌కు మెట్లు నిర్మించాలని సూచించారు.కోట వెనుకభాగంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అక్కడ లేజర్‌షో ద్వారా విజయనగరం చరిత్రను వివరించనున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. ఆ ప్రాంతాన్ని అందంగా, అహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అనంతరం మాన్సాస్ గ్రౌండ్‌లోని సరస్ డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్పప్రదర్శన స్టాల్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను సందర్శించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది రాకుండా అక్కడ స్థలాన్ని చదునుచేసి, సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ఈనెల 10వ తేదీన ప్రారంభం కానున్న అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్) పోస్టర్లను, పాంప్లేట్లను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు.

ఖ్యాతి ఇనుమడించేలా

విజయనగరం జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా, గత వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. క్రీడా సౌకర్యాలతోపాటు, క్రీడాకారులకు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. మైదానానికి చేరుకొనేందుకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఏర్పాటైన క్రీడా పాఠశాలను కడప తరలించుకుపోయినా, అప్పటి నాయకులు ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు, క్రీడా పాఠశాలను జిల్లాకు తిరిగి రప్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

విజ్జీస్టేడియంను పరిశీలిస్తున్న రాష్ట్రమంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

అంతర్జాతీయ ప్రమాణాలతో విజ్జీ స్టేడియం

అంతర్జాతీయ ప్రమాణాలతో విజ్జీ స్టేడియంను తీర్చిదిద్ది, పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ అదితి గజపతిరాజు చెప్పారు. 1985లో విజ్జీ స్టేడియంను ప్రారంభించారని, అప్పట్లోనే ఎంతో దూరదష్టితో మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు పిపిపి విధానంలో ఈ స్టేడియంను అభివృద్ధి చేసేందుకు సంకల్పించారని తెలిపారు. యువత తమ క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకొనేందుకు, పోలీస్, ఆర్మీ, రిక్రూట్‌మెంట్లకు సిద్ధం అయ్యేందుకు ఈ స్టేడియం ఎంతగానో దోహదం చేస్తోందని చెప్పారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, విద్యుత్తుశాఖ ఎస్ఇ లక్ష్మణరావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎపిడి సావిత్రి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వర్రావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఐవిపిరాజు, ఇతర అధికారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో నగరంలో రహదారుల మరమ్మతులు, సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.కోటి 20 లక్షల రూపాయలతో బిటి రోడ్డు, వివిధ రహదారుల మరమ్మతు పనులు, డివైడర్ల రైలింగులకు రంగులు, వివిధ జంక్షన్ల లో విద్యుదీకరణ, అలాగే ప్రాశస్త్య భవనాలకు విద్యుదీకరణ వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పుత్సల వీధిలో బిటి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. హుకుంపేటలోని పూజారి ఇంటి నుండి సిరిమాను చదురు గుడి వరకు తరలి వస్తుందని ఇదే సమయంలో సిరిమాను ఆగమనానికి ఎక్కడ ఆటంకం లేకుండా రహదారులను సిద్ధం చేసారు. నగరంలో జాతర రెండు రోజులు నిరాటంకంగా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు అధికారులు ప్రకటించారు. కుళాయిలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి పంపిణీ జరుపుతామనీ తెలిపారు. సిరిమాను సందర్భంగా 430మంది అదనపు పారిశుధ్య కార్మికులను నియమించనున్నట్లు తెలిపారు.ప్రసాదాల పంపిణీ సమయంలో కచ్చితంగా పేపర్ ప్లేట్లు గాని, విస్తరాకుల ప్లేట్లు గాని వినియోగించాలని చెప్పారు. ఎక్కడా ప్లాస్టిక్ వినియోగానికి తావు లేదని తెలిపారు.

క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

అథ్లెటిక్స్ విజేతలను అభినందించిన జెసి

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి 37వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఘన విజయం సాధించారు. మొత్తం 20 పతకాలను గెలుచుకొని సత్తా చాటారు. ఈ పోటీల్లో 11 స్వర్ణ, 6 రజిత, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మంగళవారం తమ ఛాంబర్లో అభినందించారు. క్రీడలకు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఏడుగురు క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర పరిధిలో వ్యాపారులంతా తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ వ్యాపారానికైనా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ట్రేడ్ లైసెన్సులు పొందిన తర్వాతనే వ్యాపారాలు సాగించాలన్నారు. ఇది వరకే ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉన్నట్లయితే తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఛాంబర్‌ఆఫ్‌కామర్స్ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసరావు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పటిష్ట భద్రత

- దొంగతనాలు జరగకుండా షీ టీమ్స్, క్రైం బృందాలు
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ తొలేళ్ళ, సిరిమానోత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు విశాఖ రేంజ్ డిఐజి జట్టి గోపినాథ్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లుపై మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పైడితల్లి అమ్మవారి ఆలయ పరిసరాలను, సిరిమాను తిరిగే ప్రాంతాలను ఎస్‌పి వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ఉత్సవాలు, అమ్మవారి పండగగా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని భద్రత చర్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొక్కిసలాటలు, జేబు దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్ జరగకుండా చూడాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్రైం బృందాలను ఏర్పాటు చేయాలని, ఈవ్ టీజింగ్‌లు జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. పండగ రోజున దర్శనాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు సేవలందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బందితో సేవాదళ్ ను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో ప్రత్యేకంగా మైకులు, లౌడ స్పీకర్లను ఏర్పాటు చేసి, అవసరమైన సమాచారాన్ని వారికి అందించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లోకి 80 శాతం వరకే ప్రజలను అనుమతించాలని అధికారులను ఆదేశించారు. సిరిమాను, ఇతర రథాలు తిరిగే ప్రాంతాల్లోకి భక్తులు రాకుండా మూడు లేయర్స్ లో బారికేడింగు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ భద్రత, బందోబస్తు నిర్వహించే తీరును, పిపిటి, వీడియోలను ప్రదర్శించి డిఐజికి వివరించారు. పండగకు 2000 మంది పోలీసు సిబ్బందిని మూడు షిఫ్ట్‌ల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ఆలయం దగ్గరలో తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి, వాటికి 80 సిసి కెమెరాలను, బాడీ వార్న్ కెమెరాలను అనుసంధానం చేసి భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డిఐజి, ఎస్‌పి

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు

- ఉద్యోగులను హింసించడం కమిషనర్ మానుకోవాలి
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకొచ్చినా సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ వ్యవస్థ ను నిర్వీర్యం చేసే పనిలో ఉందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యం కోసం గ్రామ సచివాలయాలను గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చి లక్షా 50వేల మంది ఉద్యోగులను, 2లక్షల 60వేల మంది వాలంటీర్లను నియమించిందని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సుమారుగా 11.48 కోట్ల వినతులు పరిష్కరించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వారి గౌరవ వేతనం రూ.5వేలు నుంచి రూ.10వేలు చేస్తామని చెప్పారని, ఆ హామీని అమలు చేయకపోగా ఉన్న వారందరినీ తీసేసే పనిలో ఉన్నారని తెలిపారు. విజయనగరం నగర పాలకసంస్థ లో సచివాలయ ఉద్యోగులు రోడ్డు ఎక్కే పరిస్థితి రావడం బాధాకరమన్నారు కమిషనర్ దుర్భషలాడటం, వారి ఆరోగ్య పరిస్తితి బాగు లేకపోయినా పట్టించుకునే పరిస్తితి లేకపోవడం సరికాదన్నారు. సమయ పాలన లేదన్నారు. ఉద్యోగుల బదిలీలు ఆడ్డుగోలుగా నిర్వహించడం దారుణమన్నారు. సచివాలయాలఉద్యోగులు జిల్లా కలెక్టర్‌ను, మంత్రిని కలిస్తే వారిని గౌరవించే పరిస్తితి లేదన్నారు. ఎమ్మెల్యేను కలవడానికి వెళితే పట్టించుకోలేదన్నారు. మహిళా ఉద్యోగులను తెల్లవారి నాలుగున్నర గంటలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ బెదిరించారని తెలిపారు. నగర పాలక సంస్థ కమీషనర్ ఉద్యోగులు పట్ల బాధ్యతాయుతంగా ఉండండి. ఉద్యోగులు పట్ల దుర్భాషలాడే పద్ధతి సరి కాదన్నారు. సచివాలయ వ్యవస్థ ను నీరుగార్చే పరిస్తితి నేడు కనిపిస్తోందన్నారు. విలేకర్ల సమావేశంలో పులిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి వచ్చిన పలు వినతులు స్వీకరించారు. తన నియోజక వర్గంలో ఇది రెండవ ప్రజాదర్బార్ వేదిక అని ఇందులో వివిధ శాఖలకు సంబంధించిన సుమారు 130 వినతులను ప్రజల ద్వారా స్వీకరించామని తెలిపారు. సమస్యలు అన్నింటినీ పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీటన్నిటిని ఒక వెబ్‌సైట్లో పొందుపరిచి, వీలైతే పరిష్కారమైన వాటి వివరాలు కూడా తెలిపేలా సిబ్బందికి సూచ నలు చేస్తామన్నారు. పార్టీల కతీతంగా ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తున్నారని, వాటిని ఖచ్చితంగా పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. సంబం ధిత శాఖల అధికారులు కూడా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యని ర్వహకా కార్యదర్శి చింతల రామకృష్ణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు, విజయనగరం పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతి, తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రత్నం, అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు 16వ డివిజన్ నుండి 30వ డివిజన్ పరిధిలో గల ప్రజల నుంచి మంగళవారం బొడ్డు వారి జంక్షన్‌లోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వారి సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరణ

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

కమిషనర్‌కు కార్పొరేషన్ ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర కమిషనర్ పి.నల్లనయ్య వ్యవహార తీరును నిరసిస్తూ ఉ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో కమిషనర్‌కు మద్దతుగా కార్యాలయ ఉద్యోగులు నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు అప్పలరాజు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, ఎసిపిఐవి రమణమూర్తి, ఎంహెచ్ఒ సాంబమూర్తి ధర్నాకు నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్ పల్లి నల్లనయ్య పట్ల వార్డు సచివాలయ కార్యదర్శుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పన్నుల వసూలులో వెనుకబడి ఉన్న సచివాలయ పరిపాలనా కార్యదర్శులను వెనుకబాటుకు కారణాలు తెలియజేయాలని కమిషనర్ అడగడం తప్పా అని ప్రశ్నించారు. ఈ సందర్భంలో కొంతమంది పట్ల కఠినంగా మాట్లాడినప్పటికీ అందులో పన్నుల వసూలు నిమిత్తము దిశానిర్దేశం చేస్తే ఉద్దేశమే తప్ప ఎవరినీ కించపరిచే భావంతో కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో కమిషనర్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు, మంత్రికి, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడం తగదని అన్నారు. ఈవిషయంలో తామంతా కమిషనర్‌కు అండగా ఉంటున్నామని తెలిపారు.

కమిషనర్‌కు మద్దతుగా ధర్నా చేస్తున్నా కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు

ముగిసిన హెవీ డ్రైవింగ్ శిక్షణ

కొత్త బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక విజయనగరం ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో 18వ బ్యాచ్ అభ్యర్థులకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. భవిష్యత్తులో మంచి డ్రైవర్స్ గా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 19వ బ్యాచ్ ప్రారంభవుతుందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి, 21 సంవత్సరాలు నిండిన వారు ఈ వెహికల్ లైసెన్స్ డ్రైవింగ్ ట్రైనింగ్ కు అర్హులని తెలిపారు. శిక్షణ 40 రోజుల పాటు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ డిఎన్‌రాజు 7382924030, 9866649336 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. మూడోరోజు రాష్ట్ర అధ్యక్షులు జి.ఉదయరాజు అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. ప్రధానంగా ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని, సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని తీర్మానం చేశారు. జీవో నెంబర్ 117, 84,85. జీవోలు రద్దు చేయాలని, ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సోషల్ పాఠ్యపుస్తకాలలో సిలబస్ తగ్గించాలని, మున్సిపల్, ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, కెజిబివి ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు 1998, 2008 ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని తీర్మానం చేశారు. డిఇఒ పూల్ లో ఉన్న తెలుగు ఉపాధ్యాయు లకు సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, పిఇటిలకు పీడీలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఉద్యోగ ఉపాధ్యా యుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, స్కూల్ అసిస్టెంట్లకు జెఎల్ ప్రమోషన్స్ ఇవ్వాలని, విద్యను ఉమ్మడి జాబితా నుండి రాష్ట్ర జాబితాలోనికి మార్చాలని, ప్రపంచ శాంతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ. సదాశివరావు, కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ప్రకతి సంపాదకులు జి.సత్య నారాయణ, ఉపాధ్యక్షులు వై.సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, అన్నిజిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఉదయరాజు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మొయిద జంక్షన్‌లో వామ పక్షాల ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వామ పక్ష నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ సంవత్సర కాలంగా పాలస్తీనా పై దాడులు చేసి 85 వేల మంది పాలస్తీనా పౌరులను చంపడం దుర్మార్గమన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీనా భూభాగాలు, పాఠశాలలు, మసీదులపై వైమానిక దాడులతో వేలాది మందిని పొట్టపెట్టుకున్నారన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేసి యుద్ధాలకు కారణం అవుతుం దన్నారు. ఐక్యరాజ్యసమితి కలుగజేసుకొని శాంతిని నెలకొల్పి యుద్ధ నివారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురి వామ పక్ష నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి

శృంగవరపుకోట: రేషన్ షాపుల్లో రేషన్ కార్డుదారులందరికీ కందిపప్పు ఇవ్వాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాపవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం తహశీల్దార్ అరుణకుమారికి ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పంచదారతో పాటు కందిపప్పును కూడా అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదని అందరికీ కందిపప్పు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడా మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పంచాయతీ సాధారణ సమావేశంలో ప్రకటించారు. పంచాయతీ సర్పంచ్ సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైఎస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజుతో,కార్యనిర్వాహకాధికారి అనురాధ ఉన్నారు.

వైద్యానికి ఆర్థిక సహాయం

బొబ్బిలి: పేద మహిళ వైద్యానికి కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెసి రాజు ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలోని సింగారపువీధికి చెందిన ఎం.సీతమ్మ రెండేళ్ళ క్రితం ప్రమాదంలో గాయపడి నడుం నొప్పితోను, కుడి చెంపపై ట్యూమర్‌తో బాధపడుతుంది. సీతమ్మ మంచానికి పరిమితం కావడంతో కుమార్తె బాగోగులు చూస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందించేందుకు అవస్థలు పడడంతో తెలుసుకున్న రాజు ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం చేశారు. శస్త్ర చికిత్సకు అవసరమైన రక్తం, ప్లాస్మా, ప్లేటిలెట్స్ అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

వేపాడ: విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని బక్కునాయుడుపేటలోని బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రిన్సిపాల్ ఉషారాణి అన్నారు. ఇంటర్‌లిప్స్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రానున్న రోజులన్నీ కంప్యూటర్ పైనే ఆధారపడి ఉన్నందున ప్రతి విద్యార్థిని కూడా కంప్యూటర్ శిక్షణ ద్వారా పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధ్యాపకులు పి.విజయభారతి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు డొమెస్టిక్ డేటా ఆపరేటర్లకు సంబంధించిన ఇంటర్ లిఫ్ట్ ప్రోగ్రాం ఎస్‌కోట మండలం చింతలపూడి సత్యనారాయణ రాజు (మీసేవ)లో కొనసాగుతుందన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి నాణ్యమైన ఇంటర్ లిప్స్ ప్రోగ్రామ్‌ను పిఎంశ్రీ స్కిల్‌ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

ఎంపిడిఓకు అభినందనల వెల్లువ

వేపాడ: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న డిఎలు, సిబ్బంది మంగళవారం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. గతంలో ఆయన ఇక్కడే ఇఒపిఆర్‌డిగా పని చేసి ఇప్పుడు ఎంపిడిఒగా రావడం పట్ల ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు.

కోనేరు అభివృద్ధికి చర్యలు

శృంగవరపుకోట: ఎస్‌కోట మేజర్ పంచాయతీ సీతమ్మపేట గ్రామానికి ఆనుకొని ఉన్న పాడైపోయిన కోనేరు అభివృద్ధికి పంచాయతీ కార్యనిర్వహణధికారి అనురాధ మంగళవారం ప్రక్షాళన ప్రారంభించారు. ముందుగా కోనేరు పరిసరాలలో గల చెత్త చెదారాలను తీయించి శుభ్రం చేయించారు. గట్టుపై మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణన్ని తీసుకొస్తామని స్థానికులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీ సందీప్‌ను కలిసిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట: జిల్లాకు నూతనంగా నియమితులైన జిల్లా జల యాజమాన్య సంస్థ, పథక సంచాలకులు ఇ.సందీప్‌ని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం విజయనగరంలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల రాం ప్రసాద్ పాల్గొన్నారు.

37 మంది ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో వివిధ శాఖల నుంచి బదిలీపై వెళ్తున్న 37 మంది ఉద్యోగులను మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు బదిలీ కావడం చాలా బాధాకరమన్నారు. ఇక్కడ పని చేసిన కాలంలో పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మండలం నుంచి బదిలీపై వెళ్తున్న వారంతా మండల అభివృద్ధికి ఎంతో సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కిరణ్ కుమార్, ఇఒపిఆర్‌డి గాయత్రి, ఎంఇఒ రమణమూర్తి, ఎపిఒ ఆదిబాబు, ఎఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22న ప్రాంతీయ సదస్సు

విజయనగరంకోట: కూటమి ప్రభుత్వంలోనైనా ఉత్తరాంధ్రలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. వీటి సాధనకు పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 22న అనకాపల్లిలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం అమర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రైతు సంఘం ప్రాంతీయ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం అప్పలనాయుడుతో పాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడారు. పాలకులు మారుతున్నా ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని అన్నారు. ఈనేపథ్యంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

14 నుంచి 'పల్లె పండగ'

ప్రజాశక్తి- బాడంగి

ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ 'పల్లె పండగ' పేరుతో గ్రామపంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తామని ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ తెలిపారు. ఇంతకుముందే గ్రామ తీర్మానాలు తీసుకున్న పనులను గ్రౌండింగ్ చేసేందుకు సూచనలు చేస్తామన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ప్రతి పనిని పరిశీలించి క్షేత్ర స్థాయిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని పాత ఫోటోలు అప్లోడ్ చేయకూడదని ప్రతి గ్రామపంచాయతీలో సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ గుర్తించాలని సూచించారు.

కాలువ తవ్వినవారిపై చర్య తీసుకోవాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం 46 వడివిజన్ పరిధిలోగల అర్ అర్ రెసిడెన్సీ యాజమాన్యం అక్రమంగా ఎల్‌బిజి నగర్ కాలనీలో నివాస ముంటున్న ప్రజల ఇళ్ల వైపునకు మురుగునీటి కాలువ తవ్వి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటు న్నారని సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ స్థానిక కార్పొరేటర్ భర్త లక్ష్మణరావు అన్నారు. ఏ కారణంతో ప్రజలు అనారోగ్యాలకు గురైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కాలని వాసులు జెసిబిని అడ్డుకున్నారు. తక్షణమే అపార్ట్ మెంట్ వారి ప్లాన్ ప్రకారం కాలువ తవ్వుకోవాలని కోరారు. లేని యెడల ఉద్యమిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో ఎల్‌బిజి నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి యం. శ్యాం సుందర్ అన్నారు. మంగళవారం కలవరాయి, చింతాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం వరి పంటలో తీసుకోవలసిన ఎరువులు గురించి వివరించారు. విధిగా పొటాష్ ఎకరానికి 25 కేజీలు చొప్పున వేసుకుని నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పొడదగులు దోమ, మెడవిరిప్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రవళి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డిపిఎం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వేపాడ: స్థానిక మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం ఇసి సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై డిపిఎం ఆనందరావు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల వచ్చే లాభాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో ఇసి మెంబర్లు, విఒఎలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం చామలాపల్లి గ్రామంలో సర్పంచ్ కోళ్ల సతీష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలంలో పురుగులు, తెగుళ్ల గురించి డిపిఎం రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ విజయ, ఎఒ సిబి యశ్వంత్ రావు, డిఎల్‌ఎమ్‌పి స్వామి నాయుడు, మోడల్ మండల్ కోఆర్డినేటర్ రమాప్రభ, ఎమ్‌టిఎల్ వసంత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చింతలవలస, అమకాంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ నిర్మల మాట్లాడుతూ వరి పంట చిరు పొట్ట దశ నుంచి పాలు పోసుకునే దశలో 20 కేజీలు యూరియా 205 కేజీలు పోటాస్ ఎరువులను కలిపి వేయాలన్నారు. ఆకు ముడత, పాము పొడ గుర్తించామని వీటి నివారణకు వ్యవసాయ అధికారుల సూచించిన మందులను పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, వైస్ ప్రెసిడెంట్ దిండి కోటి, నాయకులు రాంపల్లి లోకేష్, పిన్నింటి రమేష్ నాయుడు, ఎన్‌జి సాగర్, ఎఇఒ ఎం ప్రశాంతి, రెండు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని వల్లూరు, బొప్పడాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ పూర్ణిమ వరి పంట పొలాలను పరిశీలించి పురుగు, తెగుల్లు పై రైతులకు అవగాహనా కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆకుముడత పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందు 400 గ్రాములు, దోమ పోటుకు ఏస్పెట్ మందు 300 మిల్లి లీటర్లు, పాము పొడ తెగుళ్లకు హెక్సకనాజోల్ మందు 400మిల్లి లీటర్లు ఎకరాకు మొక్క మొదల్లు తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రతీ రైతు ఇపంట, ఈకెవైసి రైతు సేవ కేంద్రాలలో చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసిలు, కూటమి నాయకులు, రైతులు, ప్రకృతి వ్యవసాయం ఎంటి విజయలక్ష్మి, విహెచ్ఎ ప్రవీణ్ కుమార్, విఎఎ భారతి, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని రాచకిండాం, కొండకిండాం రైతు సేవా కేంద్రాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎఒ పివి.మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు చేపట్టవలసిన వివిధ యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ సాగు ప్రోత్సాహంలో భాగంగా సిబ్బంది వివిధ రకాల కషాయాలు తయారీని ప్రయోగ పూర్వకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి లక్ష్మి దీపిక, వ్యవసాయ సహాయకులు నిర్మల, ఎఇఒ సంతోష్, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు..

కొబ్బరి రైతుల సదస్సుకు హాజరు కావాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ నెల 10వ తేదిన జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గోవిందపురంలో జరగనున్న జిల్లా కొబ్బరి రైతుల సదస్సుకు హాజరు కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు అన్నారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం మండలంలోని చింతపల్లిలో విడుదల చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. కొబ్బరి రైతులకు పెట్టుబడులు పెరిగాయని దీంతో పాటు ఎర్రనల్లి, తెల్లదోమతో ఉత్పత్తి తగ్గుతొందని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారని దళారులు కుబేరులవుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం రైతులకు అందడం లేదన్నారు. ఇన్ని నష్టాలకు గురైనప్పటికీ పంట వేస్తున్న కొబ్బరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కొబ్బరి రైతులును ఏకం చేసేందుకు కొబ్బరి రైతులు సదస్సు ఏర్పాటు చేసామన్నారు. ఈ సదస్సుకు కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాస్‌తో పాటు పలువురు హజరవుతాన్నారు. ఆయనతో పాటు సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ, కొకొనట్ పెడరేషన్ ఇండియా కార్యదర్శి మొంగం శ్రీనువాసరావు తదితరులు ఉన్నారు.

23 షాపులకు 348 దరఖాస్తులు

●నేటితో ముగియనున్న గడువు ● 11న విజయనగరంలో లాటరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. మద్యం షాపులను దక్కించుకునేందుకు ఔత్సాహిక వ్యాపారులు పోటీ పడి టెండర్లకు దరఖాస్తులు చేస్తున్నారు. పాత మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేయగా కొత్త వ్యాపారులు కూడా దరఖాస్తులు చేసి మద్యం షాపులకు పోటీ పడుతున్నారు. మద్యం షాపులకు టెండర్లు వేసేందుకు వస్తున్న వ్యాపారులతో ఎక్సైజ్ కార్యాలయం కళకళలాడుతుంది. దరఖాస్తులు స్వీకరించేందుకు నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈనెల 1 నుంచి 8వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నియోజకవర్గం వ్యాప్తంగా 348 మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు.

23 షాపులకు 348 దరఖాస్తులు

బొబ్బిలి నియోజకవర్గంలో 23షాపులకు ప్రభుత్వం టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. 23 షాపులకు మంగళవారం సాయంత్రం 5గంటల వరకు 348 దరఖాస్తులు వచ్చాయి. బొబ్బిలి మున్సిపాలిటీలో 7షాపులకు 133 దరఖాస్తులు, గ్రామీణంలో 3 షాపులకు 26 దరఖాస్తులు,

దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

బాడంగి మండలంలోని 3 షాపులకు 68 దరఖాస్తులు, తెర్లాం మండలంలోని 4 షాపులకు 55 దరఖాస్తులు, రామభద్రపురం మండలంలోని 6 షాపులకు 66 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులను దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు.

నేటితో ముగియనున్న గడువు

మద్యం షాపులు టెండర్లకు దరఖాస్తులకు బుధవారం సాయంత్రం 5గంటలతో గడువు ముగుస్తుందని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునే వారు సాయంత్రం 5గంటలు లోగా ఎక్సైజ్ కార్యాలయానికి దరఖాస్తుతో పాటు డిడి అందించాలని కోరారు. మద్యం దుకాణాలకు ఈనెల 11న లాటరీ తీయనున్నట్లు చెప్పారు.

196 దరఖాస్తులు

శృంగవరపుకోట: మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు బుధవారం ఆఖరి తేదీ అని ఎక్సైజ్ సీఐ సిహెచ్ రాజేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌కోట, జామి మండలాలకు సంబంధించి పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మద్యం షాపులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు ఎస్ కోటకి సంబంధించి 8 షాపులు గాను 91దరఖాస్తులు అందగా, జామి మండలానికి సంబంధించి ఐదు షాపులకు గాను 105 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరికి ఈనెల 11వ తేదీన విజయనగరంలోని ఎస్.వి.ఎన్ నగర్, సరస్వతి టెంపుల్ రోడ్డులో గల సుజాత కన్వెన్షన్ సెంటర్‌లో డ్రాలు నిర్వహిస్తారని తెలిపారు.

టీ టైమ్ షాపు తనిఖీ

ప్రజాశక్తి- రాజాం

స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న టీటైమ్‌లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. లెమన్ టీలో ఎలుక మలం పేరిట ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన టీ టైమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపును, వంటగది పరిసరాలను పరిశీలించి, లెమన్ టీ పై వచ్చిన కథనానికి సరైన సమాధానం ఇవ్వాలని హెచ్చరించారు. ప్రజా ఆరోగ్యాలపై ఆడుకుంటున్న టీ టైమ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజాంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు లేకపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసినట్లు వెల్లడించారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి- రాజాం

దసరా నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ఆటోల్లో మైకులు పెట్టి మంగళవారం పట్టణంలో ప్రచారం చేశారు. ఇల్లు విడిచి వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులు, నగలు, నగదు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

హెచ్ఐవిపై అవగాహన తప్పనిసరి



హెచ్ఐవిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ అధికారి వి.వి.బి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్య శాఖ, నేచర్ స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా సఖి ప్రోగ్రాంలో భాగంగా సిహెచ్ఒలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రిప్రొడక్టివ్ హెల్త్, ఎమోషనల్ వెల్బీయింగ్, పోషకాహారం, హింస నుంచి రక్షణ వంటి ముఖ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ పి.రవికుమార్ మాట్లాడుతూ సిహెచ్ఒలది డాక్టర్స్‌తో సమానమైన వృత్తి అని చెప్పారు. జిల్లాలో ఈ ప్రోగ్రామ్ విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిహెచ్ అరుణ కుమారి మాట్లాడుతూ సఖి ప్రోగ్రాం ద్వారా కిషోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టెలి మెడిసిన్, టెలి కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.వికాస్, హెల్త్ అండ్ వెల్నెస్‌పై ఇంటెన్సివ్‌గా యస్.కోట మండలం కొట్టం పి.హెచ్.సి, జామి మండలం జామి పి.హెచ్.సిలో కిషోర్ బాలికల విద్యా ఆరోగ్యం, హెచ్ఐవి ఎయిడ్స్, యోగా వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ సిబ్బంది పి.రవికుమార్, నేచర్ టీం సభ్యులు నిశిత, సుభాష్, కృష్ణ, మేరువ ప్రసాద్, చైతన్య, బంగారుబాబు, మౌనిక, శుభలక్ష్మి, కరుణ, బొబ్బిలి, బాడంగి, తెర్లాం రామభద్రపురం పరిధిలోని పిహెచ్‌సిల సిహెచ్ఒలు యం.పూర్ణిమ, ఆర్‌కెయస్‌కె, బి.నాగరాజు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపొద్దు

బొబ్బిలి: హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపవద్దని స్టిగ్మా, డిస్క్రిమైనేషన్ ప్రతినిధి గోపాల్, టిబి యూనిట్ అధికారి నాగరాజు, వైడిఒ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ బాబు అన్నారు. మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో మంగళవారం హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ అంటూ వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైడిఒ నెట్వర్క్ సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎం, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

కుష్టు రహిత జిల్లాగా నిలపాలి

ప్రజాశక్తి - జామి

ఆషా కార్యకర్తలు, క్షేత్ర సిబ్బంది గృహాల వారీగా కుష్టు రోగుల సర్వేను నిర్వహించి, రానున్న రోజులలో కుష్టు రహిత జిల్లాగా నిలపాలని డిఎమ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం అలమండ పిహెచ్‌సిలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పర్శ లేని మచ్చలు, నూనె పూసినట్లు నిగనిగ లాడే చర్మం, అరిచేతులు, అరి కాళ్ళ కండరాల బలహీనత కుష్టు వ్యాధి లక్షణాలని తెలియజేశారు. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఆశా కార్యకర్తలు విధిగా ఆశా యాప్‌లో లాగిన్ అయి, ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో ఉన్న వివరాల ఆధారంగా, నివేదికలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత జలం కోసం నిరంతరాయంగా క్షేత్రస్థాయిలో ఆరోగ్య విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, సిహెచ్ఒ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్, ప్రేమ కుమార్, ఎమ్‌పిహెచ్ఇఒలు సత్తిరాజు, నారాయణరావు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడితల్లమ్మకు ఘటాలతో మొక్కులు

పులివేషాలు,డప్పు వాయిద్యాలతో పండగ సందడి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఘటాలతో వెళుతున్న యాత్రికులు

పైడితల్లి అమ్మవారి పండగ ముందు మంగళవారం కావడంతో నగరంలో అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం నగరంలో భక్తులు ఆయా వీధులకి చెందినవారు పులివేశాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు తరలి వచ్చారు. నగరమంతా పండగ శోభతో కళకళలాడుతుంది.

ప్రణాళికతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - సంతకవిటి

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని మండల పరిషత్తు కార్యాలయం ఎఒ రఘునాథ చారి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో సర్పంచులు, వార్డు మెంబర్లు కార్యదర్శులు పరస్పర అవగాహనతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, వీధిలైట్లు నిర్వహణ అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

జె.రంగరాయపురంలో సమస్యలు పరిస్కరించాలని సిపిఎం పార్టీ మహాసభలో తీర్మానించారు. మంగళవారం శాఖ కార్యదర్శి రెడ్డి త్రినాధ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామంలో రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి రెడ్డి త్రినాధ్ అన్నారు. రొంపిల్లి చెక్‌డాం నుంచి ఎడం కాలువ ద్వారా సాగునీరు అందించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పని 200 రోజులకు పెంచాలని 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కారించాలని నిరసన తెలిపారు. మరల శాఖ కార్యదర్శిగా రెడ్డి త్రినాధ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభకు మండల కార్యదర్శి ఎస్. గోపాలం. జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకరరావు హాజరయ్యారు.

లగేజీ ఆటో, స్కూటీ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా విజయనగరం నాతవలస రహదారిలో మంగళవారం లగేజీ ఆటో స్కూటీ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన పిన్నింటి గురునాయుడు, పిన్నింటి దుర్గారావు స్కూటీపై నాతవలస నుంచి విజయనగరం వైపు వెళుతున్నారు. విజయనగరం నుంచి నాతవలస వైపు వస్తున్న లగేజీ ఆటో ఎదురుగా ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న గురునాయుడకు దుర్గారావుకు గాయాలయ్యాయి. వీరిలో గురు నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరికీ స్థానిక పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది చికిత్స నిర్వహించారు. తీవ్రంగా గాయపడిన గురునాయుడు పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి 108లో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. గురునాయుడు విజయనగరంలో ఒక హోటల్లో పనిచేయగా, దుర్గారావు విజయనగరంలో డెంటల్ క్లినిక్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ స్కూటీపై ఉద్యోగ నిమిత్తం విజయనగరం వస్తున్నారు. ఎస్ఐ ఏ సన్యాసినాయుడు కేసు నమోదు చేసిసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమందు స్వాధీనం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలో ఆరికతోట జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ సమీపంలో రాజస్థాన్ ధాభా వద్ద సుమారు 78గ్రాముల నల్ల మందు స్వాదీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత కొన్నాళ్ల నుంచి ఇక్కడ ధాభా నడుపుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజేష్ చౌదరి ఆ రాష్ట్రం నుంచి ఈ నల్లమందు రవాణా చేస్తూ లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం రాత్రి నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో ఇది దొరికినట్లు తెలిపారు. మాదక ద్రవ్య రవాణా, వినియోగం చట్ట రీత్యా నేరం అని రాజేష్ పై కేసు నమోదు చేసి సాలూరు మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయునది నా క్లయింటు అయిన LIC HFL విజయనగరం బ్రాంచి వారు ఇచ్చిన బోగట్టా మేరకు.

వారి వ్యాపార లావాదేవీలకు శ్రీ వజ్రపు వెంకటనాయుడు S/o వెంకటరమణయ్య alies వెంకటరమణ, జమ్ము విలేజ్, గుర్ల మండలం, విజయనగరం జిల్లా వారు హౌసింగు లోను కోసం వచ్చి వారి డాక్యుమెంటులు ఇచ్చినారు. అందులో 3 లింకు డాక్యుమెంటులు ఒరిజినల్ క్రయ దస్తావేజులు 1) 1763/2015 Dt. 5-11-2015 in SRO, చీపురుపల్లి. 2) 2016/2013 Dt. 22-11-2013 in SRO చీపురుపల్లి. 3) 91/2002 Dt. 30-1-2002 in SRO చీపురుపల్లి నాకు అమ్మిన వ్యక్తి దగ్గర పోయినవి. కనుక నేను LIC HFL వారికి ఇవ్వలేక పోయును.

సదరు క్రయ దస్తావేజులు నేను గాని, నా అమ్మకముదారుని గాని ఎప్పుడు గాని, ఎవరి వద్ద గాని తనఖా పెట్టలేదు. అని చెప్పినారు.

పై విషయము సదరు డాక్యుమెంటు ఎవరి వద్దనైన తనఖా ఉన్న ఎడల మరియు అభ్యంతరములు ఉన్న పై అడ్రసు వారికి 14 రోజుల లోపల తెలియపరచవలెను. తదుపరి వచ్చే అభ్యంతరములు చెల్లవు.

C.S.BHAGAVAN
Advocate,
Vizianagaram
Cell: 9441910030

పేపరు పబ్లికేషన్
మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ వారి కోర్టులో
O.S. 35/2024

Between :
ముదునూరు రాధాకృష్ణమూర్తి రాజు వగైరాలు...వాది
And :
ముదునూరు నరసింహమూర్తి రాజు మరియు వగైరాలు .....ప్రతివాదులు
టు,

ప్రతివాది అడ్రసు నెం.2 :
శ్రీ ముదునూరు వెంకట సన్యాసిరాజు, తండ్రి నరసింహమూర్తి రాజు, హిందూ, వయస్సు 67 సం॥, వ్యవసాయం, సా॥ రయింద్రం గ్రామము, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.

Hg Date : 23-10-2024

పై నెంబరు దావాలో ప్రతివాది నెంబరు - 2 నోటీసు తీసుకోనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు ప్రతివాది నెంబరు-2కి ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 23-10-2024దీ**న హాజరు నిమిత్తము **ఉదయం గం॥ 10-30 ని॥**లకు ఖుద్దునగాని, వకీలు గారు ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియజేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా ప్రతివాది నెంబరు-2కి తెలియజేయడమైనది.

//By Court Order//

శ్రీ ఉప్పలపాటి రమేష్
వాది తరపు న్యాయవాది,
గజపతినగరం, సెల్ : 9866454030

IN THE HON'BLE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIAIANGARAM
E.P. 63/23 O.S. 210/22

Between:
Sirigudi Gopi, S/o. Venkata Rao, Hindu, aged 40 years, R/at. Chodavaram Village & post -535217. Gurla Mandalam, Vizianagaram District. ... D.Hr.

And:
Matta Samba Murthy, S/o. Unknown, Hindu, aged 59 years, R/at. D.No.1-159, Naidu Street, Chodavaram Village & Post -535317, Gurla Mandalam, Vizianagaram District. ... J.Dr.

To,
Matta Samba Murthy, S/o. Unknown, Hindu, aged 59 years, R/at. D.No.1-159, Naidu Street, Chodavaram Village & Post -535317, Gurla Mandalam, Vizianagaram District.

U/o. 21 R.54, 64-66 of C.P.C. Notice

యిందుమూలంగా తెలియజేయునది ఏమనగా, విజయనగరం 1st. ADDL. Jr. Civil Judge కోర్టులో కేసు నెం. E.P.63/23 in O.S. 210/22 యందు J.Dr. యైెన Matta Samba Murthy గారి స్థిరాస్థియైన H.No.1-159 పైన Attachment కొరకు పెట్టియున్నారు. J.Dr.కు తగు నోటీసులు చాలామార్లు పంపినా కూడా కోర్టుకు హాజరుకావడం లేదు. పైన తెల్పిన కోర్టుకు **28-10-2024** తేదీన ప్రత్యక్షంగా హాజరు కావలెను. లేనియెడల కోర్టువారు తగు నిర్ణయం తీసుకొనెదరు.

SCHEDULE

Vizianagaram Dist. Gurla Mandalam, under Chodavaram Panchayat Area, House No. 1-159 కు హద్దులు:
East : Sunkari Satti Babu House,
South : Vacant Site,
West : Vangamudi Bullamma House,
North : C.C.Road

Vizianagaram
Dt. 8-10-24

CH.SURI BABU
Advocate, Garividi
Cell : 8500626909